క్లుప్తంగా

అలరించిన కవి సమ్మేళనం

మంచిర్యాలఅర్బన్: సాహితీ సంరక్షణ సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాలలో ఓ ప్రైవేట్‌పాఠశాలలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. సంస్థ ఆవిర్భావం.. కళాకారుల పరిచయం వరకు సాధించిన విజయాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పట్వర్ధన్, అధ్యక్షుడు వామన్‌రావు, ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు ఆనంద్‌రావు, సంస్థ ఉపాధ్యక్షుడు సుగుణాకర్, సంతోష్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతి అందజేస్తున్న సర్పంచ్, దాత

బెల్లంపల్లిరూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని మాలగురిజాల సర్పంచ్ గోమాస అశోక్ అన్నారు. మాలగురిజాల గ్రామ పంచాయతీలో ఆదివారం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గోమాస మల్లేష్ జ్ఞాపకార్థం కుమారుడు శివప్రసాద్ పంపిణీ చేసిన బహుమతులను పోటీల్లో విజేతగా నిలిచిన రంగపేట క్రికెట్ టీమ్‌కు అందజేశారు. దీంతో పాటు పోటీల్లో పాల్గొన్న జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రీడల పై ఆసక్తి పెంచుకుని ఉన్నతంగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరుపతి, నిర్వాహకులు శ్రీనివాస్, శ్రీకాంత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కుమురంభీం జయంతి



నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

కోటపల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం కుమురం భీం జయంతి వేడుకలను కోటపల్లి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ కోలావార్ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ దైవం కుమురం భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదివాసీ కోలావార్ సేవా సంఘం మండల అధ్యక్షుడు అత్రం మధుకర్, ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన యోధుడు కుమురం భీం అని, భీం ఆశయసాధన కోసం ప్రతి ఒక్క ఆదివాసీ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కోశాధికారి విజయ్, రాజేశ్, శశికిరణ్, సిద్ధు, పవన్, అశోక్, శ్రీకాంత్, సాయికిరణ్, పున్నం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

భీమారం: ఇటీవల బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోకి ఆకర్శితులై మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి రత్న లక్ష్మితో పాటు ఆరెపల్లి గ్రామానికి చెందిన జుమ్మిడి మహేందర్, పలువురు బీజేపీకి రాజీనామా చేసి ఆదివారం రాష్ట్ర నాయకులు చెర్కు సరోత్తం రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ మేరకు వారికి సరోత్తంరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో బీజేపీ బూత్ కమిటీ సభ్యులు ఆలం రాజు, ఆకుదారి శంకర్, దేవేందర్, లింగయ్య ఉన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ బుక్యా రాజ్‌కుమార్, నాయకులు బెల్లంకొండ భరత్‌రెడ్డి ఉన్నారు.

దసరా ఏర్పాట్లు పూర్తి

చెన్నూర్: పట్టణంలోని గోదావరి రోడ్డులో గల గోవరమ్మ ఆలయం వద్ద సోమవారం జరిగే దసరా పండగ కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన రాంలాల్‌గిల్డా తెలిపారు. సోమవారం గోవరమ్మ ఆలయం వద్ద నిర్వహించే షమీ పూజకు స్థానిక గాంధీచౌక్ నుంచి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. శోభాయాత్రకు పట్టణ ప్రజలు తరలిరావాలని కోరారు.

ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే



ఎన్టీఆర్‌నగర్ కాలనీలో ప్రచారం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని 7వ వార్డు ఎన్టీఆర్‌నగర్ కాలనీలోని ఇంటింటికీ వెళ్లి ఆదివారం ఎ మ్మెల్యే దివాకర్‌రావు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సత్యం, వార్డు కౌన్సిలర్ ప్రకాశ్ నాయక్, నాయకులు పాల్గొన్నారు.



దండేపల్లి: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



లక్సెట్టిపేట: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నెన్నెల: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కోటపల్లి: రాంపూర్‌లో...







గంగమ్మ ఒడికి... గౌరమ్మ

సాక్షి నెట్‌వర్క్: ఒక్కేసి పువ్వేసి చందమామా.. ఒక జాము ఆయే చందమామ.. చిత్తు చిత్తులా బొమ్మ.. శివుడీ ముద్దుల గుమ్మా.. అంటూ బతుకమ్మ ఆట, పాటలతో సద్దుల బతుకమ్మ ఆటలు అంగరంగవైభవంగా సాగాయి. జిల్లా వ్యాప్తంగా ఆదివారం చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా అర్ధరాత్రి వరకు మహిళలు, యువతులు, చిన్నారులు బతుకమ్మ ఆడిపాడారు. నూతన వస్త్రాలు ధరించి ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ చుట్టూ తిరుగుతూ భక్తి శ్రద్ధల మధ్య బతుకమ్మను కొలిచారు. అనంతరం చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. అనంతరం వాగులు, చెరువుల వద్ద, ఇళ్ల వద్ద మహిళలు ఇస్తినమ్మ వాయినం.. పుచ్చుకుంటినమ్మ వాయినం అంటూ పిండి(సత్తులు) పదార్థాలను ఒకరికొకరు వాయినాలు అందించుకుని పసుపు–కుంకుమలు పెట్టుకున్నారు. చెరువులు, వాగుల వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యుత్ దీపాలు, మంచినీటి వసతులు ఏర్పాటు చేశారు.



జిల్లా కేంద్రంలోని హమాలివాడలో...



బతుకమ్మతో జెడ్పీ చైర్‌పర్సన్



ముదిగుంటలోని కొత్తగూడెంలో వేడుకలు



నస్పూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



శ్రీరాంపూర్: శాంతి మైదానంలో...





సీసీసీ కార్నర్‌లోని వెంకటేశ్వర టౌన్‌షిప్‌లో...



బెల్లంపల్లిరూరల్: మాలగురిజాలలో...



ఆర్‌కేపీ సూపర్‌బజార్ సెంటర్‌లో...



కాసిపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



జైపూర్‌లో...



బెల్లంపల్లిలో....



మాదారంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



రామాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



హాజీపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



చెన్నూర్ ఆర్యవైశ్య సంఘంలో...



భీమారంలో బతుకమ్మ వద్ద పాటలు పాడుతూ...

దాండియా నృత్యం.. భక్తిపారవశ్యం

మంచిర్యాలఅర్బన్: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మంచిర్యాలలో గుజరాతీ, రాజస్థానీల దాండియా నృత్యప్రదర్శనలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఆరేళ్ల చిన్నారుల నుంచి 60ఏళ్ల వయస్సున్న వారు సైతం ఉత్సాహంగా నృత్యం చేస్తున్నారు. సంగీతానికి అనుగుణంగా, లయబద్ధంగా, గంటల తరబడి కోలాటం చేస్తూ ఆనందోత్సవాల్లో తేలియాడుతున్నారు. రాత్రి 8గంటల వరకు కుటుంబసమేతంగా తరలివచ్చి అమ్మవారికి పూజలు జరుపుతున్నారు. నృత్యాలతో అమ్మవారిని కొలుస్తున్నా రు. స్థానిక దుర్గామందిర్ వద్ద, హిందీ హైస్కూల్ మైదానంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహిళలు, యువతుల దాండియా నృత్యాలతో కోలాహలం నెలకొంది. జిల్లా కేంద్రంలో మార్వాడీ యువ మంచ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా దాండియా నృత్యాల కోసం ఏర్పాట్లు చేశారు. నవరాత్రులు ప్రా రంభమైనప్పటి నుంచి ఇంటిల్లి పాదీ నిత్యం దాండియా ఆడుతూ సంబురాలు జరుపుకుంటున్నారు.



దాండియా నృత్యంలో మార్వాడీ యువతులు

అమ్మవారిని కొలుస్తూ.. నృత్యాలు చేస్తూ..

గుజారాత్, రాజస్థాన్‌ల్లో దుర్గానవరాత్రులు ప్రత్యేకంగా జరుగుతుంటాయి. మట్టితో వేదిక చేసి, నీటితో ఉన్న మట్టికుండలో గోధుమ విత్తనాలు చల్లుతారు. అందులో ఏదో ఒక నాణేం(వెండి, ఇతర(త్రా కాయిన్స్) వేస్తారు. ఆ కుండను అమ్మవారిగా పూజిస్తారు. హోమం చేసి దశమిరోజు నిమజ్జనం చేయటం ఆనవాయితీ. ప్రతిరోజు అమ్మవారి చిత్రపటం వద్ద మహిళలు, పురుషులు చేరి ప్రత్యేక పూజలు జరుపుతారు. అనంతరం దాండియా నృత్యం చేయటం ఓ ప్రత్యేకత. గుజరాత్, రాజస్తాన్‌కు చెందిన మార్వాడీ మహిళలు ఆలయాల వద్ద దాండియాతో రక్తి కట్టిస్తున్నారు. ఇందుకోసం మహిళలు, చోళీ, గాగ్రా దుస్తులు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. వాయిద్యాలు, పాటలతో ఎదురెదురుగా, చుట్టూ తిరుగుతూ స్టెప్పుల వారీగా ఆడటం చూపరులను కట్టిపడేస్తుంది. దాండియా నృత్యం చేస్తే దేవి అనుగ్రహం లభిస్తుందని గుజరాతీ మహిళల విశ్వాసం.



దాండియా నృత్యంలో మార్వాడీ చిన్నారులు

బంతిసాగు.. లాభాలు బాగు

- 35 గుంటల్లో సాగు చేస్తున్న లక్ష్మణ్‌రెడ్డి
- పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న రైతు

చెన్నూర్‌రూరల్: రైతులు ఎప్పుడూ ఒకే రకం పంటలు వేస్తుండడంతో భూసారం కోల్పోతోంది. ఆ తర్వాత పంట దిగుబడుల కోసం రైతులు విపరీతంగా పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ఇలాంటి తరుణంలోనే మండలంలోని ఒతుకులపల్లి గ్రామానికి చెందిన పలకల లక్ష్మణ్‌రెడ్డి అనే రైతు ఇందుకు భిన్నంగా పంట మార్పిడి పద్ధతిని అవలంభించాడు. వినూత్నంగా చేపల పెంపకం, బంతి సాగును ఎంపిక చేసుకున్నాడు. తనకున్న వ్యవసాయ భూమిలోంచి 35 గుంటల్లో చేపల చెరువును తవ్వించాడు. మరో 35 గుంటల్లో బంతిసాగు చేశాడు. ఇటు చేపల పెంపకంతో పాటు బంతిపూలను సాగు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు లక్ష్మణ్‌రెడ్డి.



లక్ష్మణ్‌రెడ్డి సాగు చేసిన బంతిపూలతోట

35 గుంటల్లో బంతిసాగు

మరో 35 గుంటల్లో బంతి సాగు చేపట్టాడు. జూన్‌లో నారు పోసి జూలైలో మొక్కలు నాటాడు. పంట సాగుకు పెట్టుబడి రూ.12వేల వరకు అయ్యింది. మొక్కలకు వారానికి లేదా పది రోజులకోసారి మాత్రమే నీటి తడులు అవసరం ఉంటుంది. మొక్కలకు చీడ, పీడలు సోకకుండా మందులు వేస్తున్నాడు. బతుకమ్మ, దసరా పండుగకు పూలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం రెండు క్వింటాళ్ల వరకు బంతి పూలు వెళ్లాయని కిలోకు రూ.100 చొప్పున విక్రయించినట్లు తెలిపాడు. దీపావళి, వివాహాది శుభ కార్యాలయాలకు కూడా పూలు అమ్మడం జరుగుతుందని, పూల దిగుబడి కూడా చాలా బాగుందని రైతు పేర్కొంటున్నాడు.

35 గుంటల్లో చేపల చెరువు

తనకున్న రెండెకరాల్లోంచి 35 గుంటల్లో రూ.లక్షతో చేపల చెరువును తవ్వించాడు. సుమారు రూ.20 వేలు వెచ్చించి 25 వేల చేప పిల్లలను అందులో వేసి పెంపకం చేపట్టాడు. చేపలకు ఆహారానికి మరో రూ.50వేల వరకు ఖర్చు చేస్తున్నాడు. ఇప్పటి వరకు ఒక్కో చేప అరకేజీ వరకు బరువు పెరిగింది. మరో నాలుగు నెలల వరకు ఒక్కో చేప సుమారు కిలో నుంచి రెండు కిలోల వరకు బరువు పెరుగుతుందని చెప్తున్నాడు. జనవరి నుండి చేపల అమ్మకం ప్రారంభిస్తానని రైతు పేర్కొన్నాడు. చేపలకు కిలోకు రూ.120 చొప్పున విక్రయించినా మంచి ఆదాయం ఉంటుందని రైతు చెబుతున్నాడు.

'బీఎస్పీతోనే అభివృద్ధి సాధ్యం'



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బన్సీలాల్

జన్నారం: తాండాలు, గూడేల అభివృద్ధి బీఎస్పీతోనే సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిని గెలిపించి, అభివృద్ధికి బాటలు వేయాలని ఖానాపూ ర్ నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి రాథోడ్ బన్సీలాల్ పేర్కొన్నారు. మండలంలోని కవ్వాల్, హాస్టల్ తాండా గ్రామాల్లో ఆదివారం ఆయన ప్రచా రం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. బీఎస్పీ అధికా రంలోకి వస్తే విద్య, వైద్యం అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి జరగాలంటే ఆదివాసీ, గిరిజన బిడ్డల భవిష్యత్ బాగు పడాలంటే బీఎస్పీకి మద్దతు తెలిపి, వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కత్తెరపాక రవీందర్, రఘువరన్, రేఖ్యానాయక్, వినోద్‌కుమార్, దత్తునాయక్, భీమ న్న, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీలో పలువురి చేరిక

మందమర్రిరూరల్: పట్టణంలోని 22వ వార్డుకు చెందిన పలువురు యువకులు ఆదివారం బీఎస్పీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఎస్పీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు తుంగపిండి రమేశ్.. యువకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు శ్రీకాంత్, శ్రావణ్, శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, అభిషేక్, అరుణ్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ బీఏ బీఈడీ కోర్సులో అడ్మిషన్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

